క్లుప్తంగా

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



ప్రింటర్‌ను హెచ్‌ఎం కమల కుమారికి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు: కొరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాలకు పూర్వ విద్యార్థులు ప్రింటర్, వంద డైరీలు, 20 కుర్చీలను శనివారం అందించారు. కొరువాడ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్‌గా ఏర్పడిన 1993–94 పదో తరగతి విద్యార్థులు మన బడి–మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా వీటిని సమకూర్చారు. వీరిని హెచ్‌ఎం కమల కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి గొంప వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు



గొండుపాలెంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, షకీలా

కె.కోటపాడు: చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో పోషక విలువలు అధికంగా ఉంటాయని గొండుపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, షకీలా తెలిపారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం గొండుపాలెంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండేందుకు ఆకుకూరలతో పాటు పప్పు దినుసులు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిరుధాన్యాలు, పప్పు దినుసులతో కూడిన ఆహార స్టాళ్లను ప్రదర్శన నిర్వహించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామానికి చెందిన ఆడారి రాము ఇటీవల మృతి చెందగా, అతడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు సర్పంచ్ జామి రమణబాబు శనివారం సాయంత్రం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ ఖాతాలో జమకానున్నాయన్నారు. నాయకులు ఆడారి కన్నారావు, కాళ్ల రాము, కాళ్ల అప్పలనాయుడు, కాళ్ల జగన్, అమ్మతల్లినాయుడు మాస్టర్, గణేశ్, పంచాయతీ కార్యదర్శులు శివ, ప్రవీణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ వేచలపు చిన్న పాల్గొన్నారు.

పాడిరైతులకు రుణాలు



పాడి రైతులకు రుణం అందచేస్తున్న డీసీసీబీ డైరెక్టర్, సర్పంచ్

చోడవరం రూరల్: జగనన్న పాలవెల్లువలో భాగంగా అమూల్ డెయిరీకి పాలు సరఫరా చేసే రైతులకు పాడిపశువుల కొనుగోలు కోసం రుణాలను అందచేస్తున్నట్టు డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల మహాలక్ష్మిశంకరరావు తెలిపారు. బెన్నవోలులో శనివారం పాడి రైతులకు రూ.45 వేల చొప్పున రుణాలందించారు. సర్పంచ్ మూడెడ్ల శంకరరావు, జన్నవరం పీఏసీఎస్ సీఈవో చినబాబు, అమూల్ డెయిరీ కేంద్రం కార్యదర్శి కంఠంరెడ్డి రమాదేవి, సచివాలయ కన్వీనర్ జంపా నగేష్, కంఠంరెడ్డి అంజి, మజ్జి వెంకట రమణ, చింతల గణేష్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రావికమతం: దేశ వ్యాప్తంగా విశ్వకర్మ యోజనను అమలు చేయడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ పార్టీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు, సీనియర్ నాయకుడు వీరమల్లు శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఉత్సాహంగా ముగిసిన క్రీడా పోటీలు

పాఠశాల స్థాయిలోనే క్రీడా మెరికలను గుర్తించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్ది ప్రోత్సహించడానికి నిర్వహించిన స్కూలు గేమ్స్ విజయవంతంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన 11 క్రీడాంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు. నువ్వానేనా అన్నట్టు సాగిన ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

- నియోజకవర్గ స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

మాడుగుల రూరల్: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కె.జె.పురం హైస్కూలు ఆవరణలో శుక్రవారం జరిగిన మండల స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపిక అయిన జట్లు వివరాలను మండల స్పోర్ట్సు అథారిటీ కోఆర్డినేటర్ డి. నర్సింహమూర్తి, పీడీ కె. ప్రసాదు శనివారం తెలిపారు. అండర్–14, 17 బాల, బాలకల విభాగంలో పలువురిని ఎంపిక చేశామని, ఈ నెల 20, 21, 22, తేదీల్లో చీడికాడ హైస్కూలులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఖోఖోలో...

స్కూలు గేమ్స్ రెండో రోజు శనివారం ఒమ్మలి హైస్కూలు ఆవరణలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఖోఖో అండర్ –17 బాలికల విభాగంలో ఒమ్మలి ప్రథమ, కె.జె.పురం ద్వితీయ, అండర్ –14 బాలురు విభాగంలో ఒమ్మలి ప్రథమ, వీరనారాయణం ద్వితీయ స్థానంలో నిలిచారని కె.జె.పురం హైస్కూలు పీడీ కె. ప్రసాదు, ఒమ్మలి పీఈటీ వెంకట్రావు తెలిపారు.

– కె.కోటపాడులో



ఒమ్మలి హైస్కూలు ఆవరణలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కె.కోటపాడు: క్రీడా పోటీలతో విద్యార్థుల్లో దాగిన ప్రతిభ వెలుగులోనికి రానున్నదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్‌లో రెండో రోజు శనివారం బాలికలకు అండర్ – 14, 17 విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌తో కలిసి ఆమె తిలకించారు. ప్రధానోపాధ్యాయిని పద్మావతి, ఉపాధ్యాయులు బోకం ఎర్రునాయుడు, మురళీకృష్ణ, మల్లాది కామేశ్వరరావు, పీడీలు ఆర్.లక్ష్మి, రోహిణి, దేముళ్లు, ఉమామహేశ్వరి, త్రినాథ్‌రాజు పాల్గొన్నారు.

రావికమతం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రావికమతం, టి.అర్జాపురం హైస్కూళ్లలో క్రీడాకారుల ఎంపిక పోటీలు శనివారంతో ముగిశాయి. 14, 15 తేదీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్ బాల, బాలికలకు రావికమతం హైస్కూల్ నిర్వహించి ప్రతిభ చూపిన 180 మందిని విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు టి.అర్జాపురం హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన 80 మంది బాల, బాలికలను నియోజకవర్గ పోటీలకు ఎంపిక చేశామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పైల లక్ష్మణరావు, టి.అర్జాపురం పీడీ రమేష్ నాయుడు తెలిపారు.

దేవరాపల్లి: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడా పోటీలు శనివారంతో ముగిసాయి. ఎంఈవో–1, స్థానిక హెచ్‌ఎం బి. పడాల్‌దాస్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ బి. బాబూరావు పర్యవేక్షణలో అండర్–14, 17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తరుణ్, ఆర్. తమ్మునాయుడు, కె.సంతోష్, నాగేష్, ఏ.సూర్య ప్రకాష్ తదితర వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంతంగా నిర్వహించారు.

బుచ్చియ్యపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోనిర్వహించిన ఆటల పోటీల్లో విజేత విద్యార్థులను శనివారం రాజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ పోటీల్లో అండర్- 14, 17 బాల, బాలికల విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాసరావు, పీడీ సత్యవతి అభినందించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.



కె.కోటపాడులో క్రీడాకారిణులతో కలిసి పోటీల్లో పాల్గొన్న అనురాధ



విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు



రావికమతం: జోన్ పోటీలకు ఎంపికైన బాలికలు



రావికమతం: జోన్ పోటీలకు ఎంపికైన బాలురు



దేవరాపల్లి హైస్కూల్‌లో వాలీబాల్‌లో హోరీగా తలపడుతున్న క్రీడాకారులు

మత్స్యకారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

గొలుగొండ: ఏఎల్‌పురంలో మత్స్యకారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం ఇక్కడ నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు ఆధ్వర్యంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా కొండబాబు, కార్యదర్శిగా శ్రీనువాసరావులను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని, వాటిని సభ్యులు వినియోగించుకోవాలని తెలిపారు. సభ్యులు చేపల వేట సాగించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఐక్యంగా ఉండాలని తెలిపారు.



ఏకగ్రీవం కొండబాబును అభినందిస్తున్న ఏఎంసీ చైర్మన్ భాస్కరనాయుడు

పెరటి కోళ్ల పెంపకంతో అనేక లాభాలు



కోళ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గిరిబాబు

గొలుగొండ: పెరటి కోళ్ల పెంపకం వల్ల అనేక లాభాలు వస్తున్నాయని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో 50 యూనిట్ల కోళ్లను రైతులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా 11 కోళ్లకు రైతునాలుగు వేల రుపాయలు చెల్లించాలన్నారు. వీటి పెంపకం వల్ల ఇంటి వద్ద ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మంగ, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా పంటల నమోదు

- చోడవరం ఏడీఏ రవీంద్రనాథ్

దేవరాపల్లి: పంటల నమోదు ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని చోడవరం డివిజన్ అగ్రికల్చర్ ఏడీ వి.రవీంద్రనాథ్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం దేవరాపల్లిలో పంటల నమోదును ఏవో వై. కాంతమ్మలతో కలిసి ఆయన పర్యవేక్షించారు. పంటల నమోదు పూర్తి చేసిన దేవరాపల్లికి చెందిన కొరుపోలు రమణ రైతు పొలంలో పర్యటించి అన్ని సర్వే నంబర్లు సక్రమంగా చేశారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రవీంద్రనాథ్ మాట్లాడుతూ చోడవరం డివిజన్ పరిధిలో 47,449 ఎకరాలకుగాను ఇప్పటి వరకు 21,417 ఎకరాలకు మాత్రమే పంటల నమోదు అయిందన్నారు. మిగిలిన రైతులంతా తక్షణమే పంటల నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల నమోదుతో ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ కనీస మద్దతు ధర, బ్యాంకుల్లో లక్షలోపు రుణానికి పావల వడ్డీ రాయితీ, క్రాప్ ఇన్సూరెన్స్ తదితర ప్రయోజనాలు సమకూరుతాయన్నారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె. సత్యారావు, భాగ్య పాల్గొన్నారు.



దేవరాపల్లిలో పంటల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రవీంద్రనాథ్

ప్రభుత్వ పాఠశాలలోనే మేలైన బోధన

- పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ డెవలపర్ హరిబాబు



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి సాఫ్ట్‌వేర్ డెవలపర్ హరిబాబు

రోలుగుంట: ప్రభుత్వ పాఠశాలలోనే మేలైన బోధన అందుతుందని, ఇష్టంతో చదివితే ఏ సబ్జెక్టు కష్టం కాదని బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి పి.హరిబాబు తెలిపారు. ఇతను ఇక్కడ పాఠశాలలో పది వరకు చదివి, ఆపై చదువులు ప్రభుత్వ కళాశాలలోనే పూర్తి చేసుకుని ప్రస్తుతం నెదర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఇన్ఫోసిస్‌లో పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా అతడిని బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.వి.టి.నాయుడు శనివారం ఘనంగా సత్కరించారు. మరొక పూర్వ విద్యార్థి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జి.డి.కానిస్టేబుల్ శివకుమార్‌ను సన్మానించారు. హెచ్‌ఎం ఎస్.అప్పారావు, సైన్స్ టీచర్ ఎం.శ్యామ సుందర్రావు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత సీఎందే

మాకవరపాలెం: ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మి తెలిపారు. నాలుగో విడత కాపు నేస్తం నగదు జమ సందర్భంగా తామరం సచివాలయంలో శనివారం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ఓర్వలేని టీడీపీ తప్పుడు ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, నాయకులు పెట్ల భద్రాచలం, బాలకృష్ణ పాల్గొన్నారు.



తామరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, నాయకులు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

- విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్

నర్సీపట్నం: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా విశాఖ డెయిరీ పని చేస్తుందని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. పెదబొడ్డేపల్లి విశాఖ డెయిరీ ప్రాంతీయ కార్యాలయంలో నర్సీపట్నం యూనిట్ పరిధి సొసైటీల అధ్యక్షులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పాడిరైతులకు మరింత ప్రోత్సాహకమైన సేవలను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి పాడిరైతుకు మేలు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ డెయిరీలు వస్తుంటాయి.. పోతుంటాయి.. విశాఖ డెయిరీ నిరంతరం రైతుల సేవలో ఉంటుందన్నారు. డెయిరీ మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పిల్లా రమాకుమారి, శీరంరెడ్డి సూరత్యనారాయణ, గేదెల సత్యనారాయణ, రెడ్డి రామకృష్ణ, చిటికెల రాజుకుమారి, జనరల్ మేనేజర్ పి.పాండ్యరాజన్, యూనిట్ మేనేజర్ సిహెచ్. సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఆకు,కూరగాయల విత్తనాల పంపిణీ

రోలుగుంట: వెలుగు శాఖ ద్వారా 150 డ్వాక్రా గ్రూపులకు 11 రకాల ఆకు, కాయగూర విత్తనాలను శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, స్త్రీనిధి మేనేజర్ కనకదుర్గ పంపిణీ చేశారు. ఆ శాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రాంతీయ సామాజిక వెలుగు సిబ్బంది పద్మ, నాగేశ్వర్రావు, పరమేశ్వర్రావు, భవానీ పాల్గొన్నారు.

నాతవరం: డ్వాక్రా మహిళలు ఆకు కూరలు ఇంటి పెరట్లో పెంచుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో 12 రకాల విత్తన ప్యాకెట్లు డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. విత్తన ప్యాకెట్‌కు రూ.60 చెల్లించాలని ఏపీఎం మత్రి లక్ష్మి తెలిపారు. మండల సమాఖ్య సంఘం అధ్యక్షురాలు పోలుపర్తి రాధ, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

తాండవ కాలువలు రీసర్వే చేసి న్యాయం చేస్తాం



తాండవ అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో జయరాం

నాతవరం: తాండవ కాలువ సమీపంలో జిరాయితీ భూములు కొన్ని ప్రభుత్వ భూమిగా నమోదు కావడంతో కాలువను రీసర్వే చేసి సరి చేస్తామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరాం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన తాండవ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఇటీవల నాతవరంలో జగనన్నకు చెబుద్దాం కార్యక్రమంలో కలెక్టరు దృష్టికి పై సమస్య వచ్చిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ సర్వే అధికారులతో ముందుగా తాండవ కాలువలు, తర్వాత ఏలేరు కాలువ రీసర్వే చేస్తామన్నారు. అనంతరం ఓటర్లు ఇంటింటా సర్వేకు సంబంధించి సమీక్షించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, తాండవ జేఈలు రామకృష్ణ, శ్యామ్‌కుమార్, నాగబాబు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, మండల సర్వేయరు బాలరెడ్డి పాల్గొన్నారు.

478 మంది రైతులకు పాస్ పుస్తకాల మంజూరు

కె.కోటపాడు: రైతు శ్రేయస్సు కోరుకునే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైసా ఖర్చు లేకుండా భూసర్వే చేయడంతోపాటు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా కొరువాడలో 478 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరయ్యాయి. వీటిని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తిలతో కలిసి ఆమె పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రెండో విడత రీసర్వేలో కొరువాడను చేర్చి, మూడు నెలల్లోనే రీసర్వేను పూర్తి చేసి రైతులకు మేలు చేసినట్లు తెలిపారు. రైతుకు మంచి చేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా ఎల్లప్పుడూ అండగా నిలవాలని కోరారు. పాస్ పుస్తకాలు మంజూరైన రైతులకు రైతు భరోసా కింద ఏటా రూ.13,500 బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నట్లు ఎంపీపీ తెలిపారు. కొరువాడ, డి.అగ్రహారం, కె.జె.పురం గ్రామాల రైతులకు పాస్ పుస్తకాలు మంజూరైనట్లు ఎంపీటీసీ అచ్చిబాబు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఆర్ఐ జానకి, గ్రామ రెవెన్యూ అధికారి పి.శంకరరావు, లంకవానిపాలెం, ఆనందపురం, వారాడ, డి.అగ్రహారం గ్రామాల సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, వంటాకు అప్పాజి, గొర్రుపోటు సౌజన్య, వేచలపు గున్నమ్మ పాల్గొన్నారు.



రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న అనురాధ, జగన్‌మోహన్, అచ్చిబాబు

మట్టి గణనాథులనే పూజించాలి

- మాడుగులలో 1,500 మట్టి విగ్రహాల పంపిణీ



మాడుగుల బస్టాండ్‌లో వినాయక విగ్రహాలు అందజేస్తున్న పూర్వ వీసీ ముత్యాలనాయుడు



విద్యార్థిని చేతిలో బుజ్జి వినాయకుడు

మాడుగుల: స్థానిక బస్టాండ్‌లో 1,500 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. పదేళ్ల నుంచి భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తూ పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు ట్రస్టు సభ్యుడు జి. మహేష్ కుమార్‌ను అభినందించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, కుక్కర మోదకొండ, బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, తవ్వాసన్యసిశెట్టి కె. కొండలరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: హెచ్‌ఎం కె.శాంతి ఆధ్వర్యంలో మల్లంపాలెం పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాల తయారీ చేశారు.

చోడవరం రూరల్: లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ గాడి సౌజన్య ఆధ్వర్యంలో ఇన్‌చార్జి హెచ్.ఎం. గౌరీశంకర్ పరిశీలించి మొదటి మూడు బహుమతులు ప్రదానం చేశారు.

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో మట్టి గణపతులను తయారు చేయించారు. వీటి విశిష్టతపై హెచ్‌ఎం కె.రాము వివరించారు.



విద్యార్థులు రూపొందించిన మట్టి వినాయకులు



మట్టి విగ్రహాలతో విద్యార్థులు, హెచ్‌ఎం

ఓజోన్ పొరను కాపాడుకుందాం



చోడవరం రూరల్: గవరవరంలో ఓజోన్ పొర రక్షణ చిత్రప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు



కె.కోటపాడు: ఓ–3 అక్షర రూపంలో గొడుగులతో నిల్చొని విద్యార్థుల విన్యాసం

చోడవరం/చోడవరం రూరల్/రోలుగుంట/కె.కోటపాడు: ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణా దినోత్సవాన్ని చోడవరం మండలం అడ్డూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. ఓజోన్ పొరకు నష్టం కలిగించే క్లోరోఫ్లూరో కార్బన్స్ విడుదల చేసే ఏసీలు, ఫ్రిడ్జ్‌ల వాడకాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా ప్రజలను చైతన్య పరిచారు. ప్రధానోపాధ్యాయిని చైతన్య షీల, ఉపాధ్యాయులు, రమణ, సుష్మా, హేమలత పాల్గొన్నారు. లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గవరవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో సైన్సు టీచర్లు కె.విశ్వనాథ్, ఎ.ఎస్.కృపల సారథ్యంలో విద్యార్థులు ఓజోన్ పరిరక్షణ పట్ల వివిధ ఆకారాలలో విన్యాసాలు చేశారు. ఓజోన్ పరిరక్షణ చిత్రాల ప్రదర్శనను తిలకించారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వరప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీరామూర్తి, శర్మ, రమాకుమారి పాల్గొన్నారు. కె.కోటపాడు మండలం గొండుపాలెం హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎల్.వీ.నారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల మైదానంలో విద్యార్థులు ఓ–3 అక్షర రూప విన్యాసాన్ని ప్రదర్శించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు. కింతాడ కేజీబీవీలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: ఎంపీపీ వేమవరపు రామధర్మజ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ముందుగా ఏవో వాసుదేవరావు తన శాఖ సంబంధించి చదివి వినిపించారు. మాడుగల పట్టణంతోపాటు గ్రామాల్లో ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని, కొన్ని చోట్ల స్తంభాలు మార్పు చేయాలని కోరుతున్నా ట్రాన్సకో అధికారులు పట్టించుకోలేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకుచ్చారు. ఎంపీపీ రామధర్మజ కలుగజేసుకుని ట్రాన్స్‌కో ఉన్నత స్థాయి అధికారులకు ఫోన్లో సమస్య వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ ఇంకా అర్హులకు పథకాలు అందకపోతే ఎందుకు అందలేదో తెలియజేయాలన్నారు. జెడ్పీటీసీ కె.రమణమ్మ, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్

400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

కె.కోటపాడు: శృంగవరం శివారు కొత్తభూమిలో బెల్లం పులుపును ఎ.కోడూరు పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. ఎస్ఐ బి.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సారా తయారీకి మూడు డ్రమ్ములు, పాత్రల్లో నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేశారు.